క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుంతకల్లుటౌన్: తెలంగాణా రాష్ట్రం నిజామాబాద్‌లోని 9వ బెటాలియన్ పరిధిలో ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించిన జాతీయ అడ్వాన్స్ లీడర్ షిప్ క్యాంప్–2లో పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు భవాని, శివకృష్ణను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు సన్మానించారు. ఈ క్యాంప్‌లో భాగంగా ఫిజికల్, కల్చరల్ యాక్టివిటీస్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర వాటిపై శిక్షణ కల్పించడమే కాకుండా పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ఇద్దరినీ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

69 మందికి ఉద్యోగాలు


అభ్యర్థినికి ఆఫర్ లెటర్లు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి: తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాబ్ అచీవర్స్‌డే ఘనంగా నిర్వహించారు. కల్పతరువు ప్రాజెక్ట్‌లో భాగంగా కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సును చదివిన 69 విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హరిబాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సునీల్ కుమార్ తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, ఆకృతి కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో వీరికి ఉద్యోగాల ఆఫర్ రాగా వారికి కళాశాలలో ఆఫర్ లెటర్లను అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వారితో పాటు కళాశాల సిబ్బంది అభినందించారు.

కంపచెట్ల తొలగింపు


కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్తచెరువు నుంచి గుంతకల్లు వరకూ ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న కంపచెట్ల తొలగింపు పనులను సోమవారం విద్యుత్ శాఖ అధికారులు చేపట్టారు. ఏడీ నాగేంద్ర కుమార్ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. గుంతకల్లు పట్టణానికి విద్యుత్ సరఫరాను అందించే 33 కేవీ లైన్ పాతకొత్త చెరువు నుంచి వస్తుందన్నారు. విద్యుత్ లైన్ కింద భాగంలో భారీ ఎత్తున కంపచెట్లు పెరిగి కరెంట్ తీగలకు తగులుతున్న నేపథ్యంలో ప్రమాదాన్ని అరికట్టే క్రమంలో భాగంగా కంపచెట్ల తొలగింపు పనులను చేపట్టినట్లు ఏడీ తెలిపారు.

సీఎస్ఐ చర్చి సంఘం కమిటీ ఎంపిక


సీఎస్ఐ చర్చి పట్టణ సంఘ సభ్యులు

గుత్తి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో సోమవారం సీఎస్ఐ సంఘ చైర్మన్ రెవరెండ్ సాలోమోన్, ఎలక్షన్ అబ్జర్వర్ రస్సెల్ కిరణ్ సమక్షంలో సీఎస్ఐ చర్చి పట్టణ నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. నూతన సంఘం కార్యదర్శిగా విజయ కుమార్, కార్యవర్గ సభ్యులుగా జేమ్స్ వర ప్రసాద్, బింగి కిరణ్ బాబు, దయానంద్, మనోరంజిత, మేరి హర్షలత, మార్షల్ రియాజ్, దేవ సునీత్ కుమార్, మోసెస్ ఎన్నికయ్యారు.

స్తంభం నిలబెట్టారు!


జేసీబీతో స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: మండలంలోని కమ్మువారిపల్లి నగరూరు రోడ్డుమార్గంలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ఆదివారం సాక్షిలో 'పడిపోతే ప్రమాదమే' అనే కథనం ప్రచురించింది. ట్రాన్స్‌కో ఏఈ నరసింహులు మంగళవారం సిబ్బందితో ఆ ప్రదేశానికి చేరుకుని జేసీబీతో ఒరిగిన స్తంభాన్ని నిలబెట్టారు. ఎన్నో రోజులుగా పట్టించుకోని అధికారులు సాక్షి కథనంతో స్పందించారని పరిసర ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేశారు.


గుంతకల్లులోని ధర్మవరం రైల్వేగేట్ రోడ్డులో నిల్వ ఉన్న వర్షపునీరు


గుంతకల్లులోని మండీబజార్ వాటర్‌ట్యాంక్‌కు వెళ్లే దారిలో ఇలా..


యాడికి మండలం పుప్పాల గ్రామంలో రహదారిపై వర్షపు నీరు

పాలకుల మాటలు.. నీటి మూటలు!

- చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కూటమి ప్రభుత్వం కొలువయ్యాక రోడ్లు మరమ్మతులు చేయకపోడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు ఛిద్రం కావడంతో ప్రయాణం నరకమవుతోంది. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలబడడంతో వాహదనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు పర్యవేక్షించి రోడ్లు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గుంతకల్లుటౌన్/యాడికి: రోడ్లన్నింటికీ మహర్దశ మొదలైందని, రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దుతామని బాకాలు ఊదిన కూటమి నాయకుల మాటలు నీటిమూటలుగా మారాయి. రహదారులు ఛిద్రమవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు గుంతకల్లు పట్టణంలోని పలు రోడ్లు రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ గోతులుగా మారడంతో చినుకులకే చిత్తడిగా మారుతున్నాయి. అసలే అధ్వానమైన రోడ్లపై మున్సిపల్ అధికారులు ప్యాచ్ వర్క్‌లు చేయించకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉంటూ చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. డ్రైనేజీల్లో పూడిక తీయించకపోవడంతో మురుగు ముందుకు ప్రవహించక వీధులన్నీ కంపుకొడుతున్నాయి. పట్టణంలో ప్రధానంగా మెయిన్‌రోడ్డు, ధర్మవరం రైల్వే గేట్ రోడ్, మండీబజార్ వాటర్ ట్యాంక్ వెళ్లే రోడ్, గంటచర్చికి వెళ్లే రోడ్‌తో పాటు, బీరప్పగుడి సర్కిల్‌లోని మెయిన్‌రోడ్డులల్లో ఏర్పడిన గోతుల్లో నిల్వ ఉంటున్న వర్షపు నీటితో ప్రమాదాలు జరిగే అవకాశముంది. వర్షం కురిసే సమయాల్లో ఆ రోడ్లపై జాగ్రత్తగా వెళ్లకపోతే అంతే సంగతులు. సమస్య ఇంత జఠిలంగా ఉన్నా రోడ్డు ప్యాచ్ వర్క్‌లు చేయించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ సత్వరమే సమస్యలను పరిష్కరించి ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


యాడికి మండలం చందన గ్రామంలో డోన్‌కు వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపు నీరు


గుంతకల్లులోని గంటచర్చికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గోతిలో వర్షపు నీరు

నరకప్రాయంగా ప్రయాణం

యాడికి మండల వ్యాప్తంగా మూడు రోజులుగా నిర్విరామంగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో మండలంలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలుస్తోంది. ప్రధానంగా మండలంలోని పుప్పాల, వేములపాడు, నగరూరు, చందన, లక్ష్మంపల్లి, రెడ్డి గుడిసెలు, కమలపాడు, చింతలాయపల్లి, కుందనకోట, రాయలచెరువు గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు నిలుస్తోంది. వాహన రాకపోకలతో కొన్ని చోట్ల మెటల్ చిప్స్ పైకి లేచి గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ నెల 28వ తేదీ వరకూ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో రహదారులు మరింత అధ్వానంగా మారే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి రహదారులపై నిలిచిన వర్షపు నీటిని బయటకు పోయేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట, బేతాపల్లి, పెద్దొడ్డి పంచాయతీలకు ముగ్గురు కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రేడ్–3 పంచాయతీలను గ్రేడ్–2లుగా మార్చడంతో జిల్లా పరిషత్ అధికారులు మండలానికి ముగ్గురు కార్యదర్శులను నియమించారు. గ్రేడ్–3 పంచాయతీలకు కార్యదర్శులుగా ఉన్న వారిని పదోన్నతి కల్పించి విడపనకల్లు మండలంలో కార్యదర్శిగా ఉన్న మహబూబ్‌బాషాను పెద్దొడ్డికి, పామిడి మండలంలో ఉన్న షామిర్‌బాషాను కొత్తపేట పంచాయతీకి, ఉరవకొండ మండలంలో ఉన్న ప్రసాద్‌గౌడ్‌ను బేతాపల్లి పంచాయతీకి కార్యదర్శులుగా నియమించారు. సోమవారం వారు బాధ్యతలు స్వీకరించారు.

పోలీసుల అదుపులో పశువుల వ్యాన్లు

గుత్తి: గుత్తి పోలీసులు అనుమానంతో మూడు పశువుల వ్యాన్లను సోమవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. బీజేపీ జిల్లా నాయకుడు తెగదొడ్డి తిమ్మారెడ్డి సమాచారం మేరకు పోలీసులు పత్తికొండ నుంచి గోరంట్లకు మూడు వ్యాన్లలో తరలిస్తున్న పశువులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ సురేష్ విచారించారు. అయితే పశువులను తరలిస్తున్న వారు రైతులని నిర్ధారణ కావడంతో వ్యాన్లను వదిలివేశామన్నారు.

కంపోస్ట్ యార్డు ఏర్పాటు చేయండి


ఖైదీలతో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్

గుత్తి: జైలు ఆవరణలో కంపోస్ట్ యార్డును ఏర్పాటు చేయాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. గుత్తి స్పెషల్ సబ్ జైలును సోమవారం ఆయన స్థానిక ఏడీజే సాధుబాబుతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బ్యారెక్కులు, స్టోర్ రూమ్, బాత్ రూమ్‌లు, టాయిలెట్లు, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు ఆవరణలో వెంటనే కంపోస్ట్ యార్డును ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. జైల్లో సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ గంగాధర్ కుమార్, టైపిస్ట్ సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వర్షాలు కురిసి రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. అసలే కరోనా విజృంభిస్తున్న వేళ అధికారులు నిర్లక్ష్యం వీడి శానిటేషన్‌ను మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ పవన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ రంగమ్మ మాట్లాడుతూ శ్మశాన వాటికల నిర్వహణను మున్సిపల్ యంత్రాంగం గాలికొదిలేసిందన్నారు. సరస్వతీ విద్యామందిరం వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి కింద మురుగు నిల్వ ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. టెండర్లు ముగిసినా పనులు చేపట్టకపోవడంపై ఆమె ప్రశ్నించారు. కౌన్సిలర్ కుమారి మాట్లాడుతూ తన వార్డులో ముళ్లచెట్ల తొలగించేందుకు జేసీబీని పంపాలని ఐదునెలల నుంచి కోరినా పట్టించుకోకపోవడంపై శానిటేషన్ అధికారులను నిలదీశారు. వార్డులో శానిటేషన్ అధ్వాన్నంగా ఉందని, ఫాగింగ్‌ను చేయించాలని ఆమె కోరారు. సభ్యులడిగిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని చైర్‌పర్సన్ భవాని అధికారులకు సూచించారు. అజెండాలో పొందుపరిచిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కమిషనర్ నయీమ్ అహ్మద్, వివిధ విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


రికార్డులను పరిశీలిస్తున్న సీఐ పుల్లయ్య

బుక్కరాయసముద్రం: వాహన దారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో వాహన దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పుల్లయ్య హెచ్చరించారు. సోమవారం సాయంత్రం బీకేఎస్‌లో మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన దారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహన డ్రైవర్ తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. నాలుగు చక్రాల వాహనాలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం రికార్డులు సరిగ్గాలేని పలువురికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ గౌస్ మహ మ్మద్ బాషా సూచించారు. సోమవారం మండలంలోని కల్లూరులో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు సమక్రమంగా లేని వారికి జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్

- ఒకరికి గాయాలు


గాయపడిన మల్లికార్జున

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో సోమవారం ఆటోను టిప్పర్ ఢీకొన్న ఘటనలో రావులుడికి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వివరాలు.. మల్లికార్జున ఆటోలో గుమ్మడికాయలు వేసుకుని గుత్తికి వెళ్తుండగా రాయలచెరువు నుంచి క్రిష్టిపాడులోకి చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ ఢీకొంది. ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ టిప్పర్‌ను సంఘటనా స్థలంలో ఆపకుండా ప్రభుత్వాస్పత్రి ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 3 వరకూ యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో యోగాలో శిక్షణ ఇస్తున్నామన్నారు. రోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు యోగా శిక్షణకు హాజరు కావచ్చని ఎంపీడీఓ తెలిపారు.

బాధిత కుటుంబానికి అండ


ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

పెద్దవడుగూరు: మండలంలోని జి.వెంకటాంపల్లికి చెందిన నాగరాజు ఇటీవల బండిశూల తిరునాలలో జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లపై రథ చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు, 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అతడిని సోమవారం పరామర్శించారు. తమ వంతుగా రూ.70 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, అధైర్య పడవద్దని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

సజావుగా ఎంసెట్ పరీక్ష

గుత్తి: గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంసెట్ పరీక్షలు జరుగుతున్నాయి. వర్షం రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వర్షంలోనే గేట్స్ కాలేజీకి చేరుకున్నారు. ఎంసెట్ పరీక్షలు సజావుగా సాగాయని అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శన


సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన దృశ్యం

పామిడి: మండలంలోని రామగిరి గ్రామంలో తెలుగుభాష సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళాసమితి సౌజన్యంతో ఆదివారం రాత్రంతా నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. స్వరరాగ నాటక కళాసమితి సభ్యులు పుంజా కృష్ణారావుయాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, హనుమంతరెడ్డి, వనజకుమారి, నాగవేణి పోటీపడి నటించారు. అనంతరం కళాకారులను గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు.

నేడు ల్యాండ్ దర్బార్

పెద్దపప్పూరు: మండలంలోని భూసమస్యలపై మంగళవారం ల్యాండ్ దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఏఎస్పీ రోహిత్ కుమార్, ఆర్డీఓ కేశవ నాయుడు పాల్గొని భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి


పెద్దపేటలో త్రైత సిద్ధాంతంపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

యాడికి/పామిడి: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ సిద్ధాంతాలను ఆచరిస్తూ భక్తి మార్గంలో నడవాలని గుత్తి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. సోమవారం యాడికి మండలకేంద్రంలోని పెద్దపేట, కూర్మాజి పేట, పచ్చారు మేకల పల్లి గ్రామాల్లో వారు ఇంటింటికీ వెళ్లి పుస్తకాలు, పంపిణీ చేస్తూ హిందూ ధర్మ సిద్ధాంతాలను వివరించారు. వారు మాట్లాడుతూ అన్నింటికీ మూలమైనది భక్తి మార్గమన్నారు. నిత్యం హిందూ ధర్మ సంప్ర దాయాల ప్రకారం గుడికి వెళ్లి పూజలు చేయడం అలవర్చుకోవాలన్నారు. ఆధునిక పోకడలతో హిందూ ధర్మ సంప్రదాయాల ను విస్మరించటం తగదన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బ్రహ్మయ్య, శ్రీనివాసులు, రాజారావు, శివాజీరావు, రామాంజనేయులు, చంద్రశేఖర్, నాగరాజు, గోపాలు, దేవేంద్రవాణి, లలిత చక్ర నాయక్, లలిత నాగరాజులు పాల్గొన్నారు. అలాగే పామిడి మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి–ఇందుజ్ఞాన వేదిక గుంతకల్లు, నాగసముద్రం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సమితి కమిటీల అధ్యక్షులు కృష్ణమూర్తి, ధనుంజయ, సభ్యులు త్రివేణి, లక్ష్మీదేవి, సర్వజ్ఞ వరలక్ష్మి, సాయి, మల్లి, రాజేశ్వరి, చైతన్య, రాజు, రమేష్, శ్రేయస్సు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్


జూదరులను అరెస్ట్ చేసిన సీఐ శివగంగాధరరెడ్డి

తాడిపత్రి: రూరల్ పరిధిలోని ఓ పాడుబడిన థియేటర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. గన్నెవారిపల్లి కాలనీలోని పాడుబడిన పద్మాలయ థియేటర్‌లో జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు.. సిబ్బందితో కలసి దాడి చేయగా ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 5,910 ల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'స్టాఫ్ నర్సుపై చర్యలు తీసుకోండి'

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఖైరున్నీస్సా బేగంపై చర్యలు తీసుకోవాలని సోమవారం సీపీఎం నాయకులు దస్తగిరి, ఈశ్వరరెడ్డి, కార్యకర్తలు డిమాండ్ చేశారు. డాక్టర్ అందుబాటులో లేని సమయంలో ఆస్పత్రికి వెళ్లే రోగుల పట్ల ఆమె దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. అలాగే తెలికి, చింతల చెరువు, మేడిమాకులపల్లి గ్రామాల ప్రజలు పెద్దవడుగూరు ఆస్పత్రికి వస్తే .. మా ఆసుపత్రికి ఎందుకు వస్తారని ఆమె రోగులపై విరుచుకుపడుతోందన్నారు. రోగులను ఇబ్బందులు పెడుతున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీటీ వెంకటేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆమెపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు.

విరబూసిన మే పుష్పాలు


గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధిలో చిన్న మస్తాన్, అజయ్ కుమార్ ఇంట్లో సోమవారం మే పుష్పాలు విరబూశాయి. ఆ పుష్పాలను వీక్షించడానికి చుట్టు పక్కల జనాలు తరలివచ్చారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- స్పీడ్ బ్రేకర్లు లేక నిత్యం ప్రమాదాలు
- భయాందోళనలో ప్రజలు, భక్తులు


నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశం


ఆలయం ఎదుట స్పీడ్ బ్రేకర్లు లేని రహదారి

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలోని ప్రసిద్ధ బొలికొండ రంగనాథ స్వామి ఆలయం ఎదురుగా 67వ నంబర్ జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజుకొక ప్రమాదం జరుగుతున్నా జాతీయ రహదారుల అధికారులు తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో పలువురు క్షతగాత్రులవుతున్నారు. గుత్తి–తాడిపత్రి మార్గంలో ఆలయం ముందు భాగంలో ఉన్న జాతీయ రహదారిలో అంకోలా నుంచి కృష్ణపట్నం పోర్టుకు రోజూ వందలాది భారీ వాహనాలు, కార్లు వెళ్తుంటాయి. ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులు అక్కడే వాహనాలు నిలుపుతుంటారు. దీంతో రోడ్డు కుచించుకుపోవడంతో వేగంగా వెళ్తున్న వాహనాలతో పెద్ద ఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే కాక ఆలయం ఎదుట వాహనాలను ఆపి ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు. దీంతో విశాలంగా ఉన్న రోడ్డు చిన్నది కావడంతో వాహనాలు వేగంగా దూసుకువస్తుంటాయి. గతంలో రోడ్డుపై ఉన్న స్పీడ్ బ్రేకర్లు నూతన రోడ్డు వేసినప్పుడు తొలగించడంతో రోజూ ఒక ప్రమాదమైనా జరుగుతోంది. రోడ్డు దాటుతున్న వారిని వేగంగా వచ్చిన లారీ, కార్లు ఢీకొని పదుల సంఖ్యలో గాయపడగా పలువురు మృతి చెందారు. మరిన్ని ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోకుండా జాతీయ రహదారుల అధికారులు స్పందించి ఆలయం ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు వేయించి ప్రమాదాలు నివారించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు లేదు?


మాట్లాడుతున్న జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు.. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడంలో భాగంగా రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు లేదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ నీలం భాస్కర్ ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలోని మహానేత వైఎస్సార్ విగ్రహం ఎదుట నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు, బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో విధ్వంసకర పాలన జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధించడం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో భయానక వాతావరణం సృష్టించి కూటమి ఎమ్మెల్యేలు మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటంపై దౌర్జన్యానికి పాల్పడడం దారుణం అన్నారు. ఏడాది కాలం గడుస్తున్నా పేదలకు ఒక్క పథకం కూడా ఇవ్వలేని టీడీపీ ఎమ్మెల్యేలు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అధికారులపైనే దౌర్జన్యాలకు పాల్పడడం సరికాదన్నారు. ప్రభుత్వానికి రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెప్పుతారన్నారు. చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ముత్యాలశీన, జెడ్పీ మాజీ సభ్యుడు కొండయ్య, పురుషోత్తం, కుళ్లాయప్ప, ఆది, సత్య నా రాయణ, నిమ్మల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.